నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ సంపుటి: 5 సంచిక: 38 బుధవారం, 08 జూలై 2026 పేజీలు - వెల : 3/-




# నీళ్లు.. నిప్పులు!

## కౌంటర్ ఇచ్చేందుకు రేవంత్ రెడీ

- నేడు ప్రజాభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- అన్ని కోణాల్లోనూ సాగునీటి ప్రాజెక్ట్ లపై సమీక్ష
- కేటీఆర్ వ్యాఖ్యాలకు చెక్ పెట్టేందుకు మంత్రులూ రెడీ

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాభవన్‌లో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పై మంగళవారం సాయంత్రం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ జరగనుంది.ఈకార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు ప్రాజెక్టు ప్రస్తుత స్థితి, రిపేర్ పనులు, నీటి సరఫరా సమస్యలు తదితర అంశాలపై వివరాలు అందించనున్నారు. ఈ సమీక్ష గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ చేస్తున్న తీవ్ర విమర్శల కారణంగా జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు జీవనాడి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవలి సమావేశాల్లో రేవంత్ ప్రభుత్వం నీటిని వృథా చేస్తోందని, మేడిగడ్డ బ్యారేజ్‌లోని సమస్యలను సరిచేయకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. కేసీఆర్‌కు ఒక వారం కాళేశ్వరం అప్పగిస్తే మొత్తం తెలంగాణలో నీళ్లు పారించి చూపిస్తామని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. అంతేకాదు.. కేటీఆర్ టీమ్.. కన్నెపల్లి పంప్ హౌస్‌కి కూడా వెళ్లడం చర్చను మరింత రాజేసింది.



### ఫౌండేషన్ సమస్యలు ఉన్నాయంటున్న సర్కార్

ప్రభుత్వం మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినా, డిజైన్ లోపాలు, నిర్మాణ లోపాలు, అవినీతి కారణంగా మేడిగడ్డ, అన్నారం, సుండిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శిస్తోంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ , జ్యుడీషియల్ కమిషన్, విజిలెన్స్ కమిషన్ నివేదికలు ఈ లోపాలను స్పష్టం చేశాయని నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు బ్యారేజీలకూ ఫౌండేషన్ సమస్యలు ఉన్నాయని, శాస్త్రీయ పరీక్షలు జరుపుతున్నామని అన్నారు. బ్యారేజీల మరమ్మతు పనులు 2027 మిడ్ సంవత్సరానికి పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని చెప్పారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (పుణె), ఐఐటి బాంబే వంటి సంస్థలు పరీక్షలు చేస్తున్నాయనీ, ఎన్డీఎస్ఏ , సెంట్రల్ వాటర్ కమిషన్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని వివరించారు. కాళేశ్వరం కూలిపోవడం స్వతంత్ర భారతదేశంలో అతి పెద్ద మానవ నిర్మిత విపత్తు అని వ్యాఖ్యానించారు.

(వాస్తవ తెలంగాణ )

### 18 లక్షల ఎకరాలకు నీరు అందించాలని..

ఇది ఇలా ఉంటే సీఎం రేవంత్ రెడ్డి గతంలో కాళేశ్వరం స్కామ్‌పై సీబీఐ విచారణకు ఆదేశాలు ఇచ్చారు. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం ప్రజా భవన్ సమీక్ష జరుగుతోంది. ప్రాజెక్టు ద్వారా 18 లక్షలఎకరాలకునీరుఅందించాలనేలక్ష్యంతో నిర్ణయాలు తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గోదావరి నదిపై కాళేశ్వరం దగ్గర నిర్మించిన భారీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, అనేక రిజర్వాయర్లు, పంప్ హౌసులు దీని భాగాలు. గతంలో వరదలు, నిర్మాణ లోపాల వల్ల మేడిగడ్డ బ్యారేజ్‌లో రెండు పిల్లర్లు దెబ్బతిన్నాయి. దీని పర్యవేక్షణలో ప్రభుత్వం శాస్త్రీయ మరమ్మతులు చేపట్టింది. కేటీఆర్ విమర్శలకు ప్రతిస్పందనగా ఈ ప్రెజెంటేషన్ ద్వారా ప్రభుత్వం వాస్తవాలు, చేపట్టిన చర్యలు వివరించనుంది.



### రైతులకు సాగు నీరు ఇవ్వాల్సిందే : రేవంత్ రెడ్డి

రైతులు, వ్యవసాయ రంగం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, లోపాలను సరిదిద్ది ప్రాజెక్టును పునరుద్ధరించడం ద్వారా నీటి లభ్యతను మెరుగుపరచాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమీక్షలో కృష్ణా నది నీటి వివాదాలు, ఇతర సంబంధిత అంశాలు కూడా చర్చించవచ్చు. ప్రజాభవన్‌లో జరిగే ఈ కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లో మరింత చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వం ప్రకారం, మరమ్మతు పనులు శాస్త్రీయంగా, నిపుణుల సలహాల మేరకు జరుగుతున్నాయి. రైతులకు వెంటనే నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే బీఆర్ఎస్ వర్గాలు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ఆరోపిస్తున్నాయి

# పారిశ్రామిక రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలవాలి

మర్కుక్ : **(వాస్తవ తెలంగాణ )** పారిశ్రామిక రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలవాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంలో బయోటెక్ పార్క్–3లో ఏర్పాటు చేసిన శిరో ఫార్మా అత్యాధునిక ఔషధ ఉత్పత్తి కర్మాగారాన్ని ఆ సంస్థ చైర్మెన్ గోవిందారెడ్డి, మదుసూదన్‌లతో కలసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఫార్మా రంగానికి అధిక ప్రాధాన్యత, అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో పెట్టు బడులు, ఉపాధి కల్పన కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఫార్మా రంగంలో తెలంగాణను ప్రపంచ స్థాయి హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ ఫార్మా రంగంలో హైదరాబాద్ అగ్రగామిగా నిలిచిందని, ఆ ఫార్మా బ్రాండ్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణను ఫార్మా రంగానికి ల్యాండ్‌మార్క్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్‌కు సంబంధించిన ఔషధాలను తయారు చేసే పరిశ్రమలకు అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో శిరో ఫార్మా సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు.



# 2028 జూన్ నాటికి ఎస్ఎల్బీసీ పూర్తి



హైదరాబాద్ :**(వాస్తవ తెలంగాణ )** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్బీసీ) ప్రాజెక్టును 2028 జూన్ నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్‌పై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాలు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. దేవరకొండ, శ్రీశైలం రెండు వైపులా భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచామనీ, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయనీ, ఈ నెలాఖరులోగా పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. డిండి, నక్కలగండి, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి అన్నారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్ఎల్బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరుతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఈ ప్రాంత అభివృద్ధికి ఎస్ఎల్బీసీ కొత్త దిశ చూపిస్తుందని అభిప్రాయపడ్డారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఈఎన్‌సీ వి.రమేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీ హైకోర్టులో.. కవితకు నిరాశ

## ఈసీ నోటీస్‌కు సమాధానం చెప్పాలని ఆదేశం

- పార్టీ పేరు మార్చాలంటూ కవితకు ఈసీ లేఖ
- దీనిపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత
- ఇరు వర్గాల వాదనలు విన్న హైకోర్టు
- ఈసీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేమన్న న్యాయమూర్తి



తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు ఖరారు విషయంలో ఈసీ నోటీసులకు సమాధానం చెప్పాలని కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. టీఆర్ఎస్ పార్టీ పేరుపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయని అందువల్ల పార్టీ పేరు కోసం ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని కవితకు ఈసీ లేఖ రాసిన నేపథ్యంలో ఈసీ లేఖపై కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం అంటే ఎన్నికల సంఘం విధుల్లో జోక్యం చేసుకోవడమే అవుతుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. జూన్ 23న ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులకు సరైన రీతిలో సమాధానం ఇవ్వాలని కవితను ఆదేశించింది. ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలన్నింటికీ ఈ సమాధానంలో వివరణ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది.

(వాస్తవ తెలంగాణ )

### కోర్టులో ఇరుపక్షాల వాదనలు

విచారణ సందర్భంగా 'తెలంగాణ రక్షణ సమితి' పేరు రిజిస్ట్రేషన్‌పై తీవ్రమైన అభ్యంతరాలు వచ్చాయని కోర్టు ప్రస్తావించింది. అయితే, కవిత తరపు న్యాయవాదులు ఈ వాదనను తోసిపుచ్చారు. పార్టీ పేరుపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, ఈ విషయంలో వ్యక్తిగతంగా వాదనలు వినిపించేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వలేదని కవిత న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కాగా, తాము అన్ని నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. .

### ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వండి

వాదనలు విన్న అనంతరం ఢిల్లీ హైకోర్టు కీలక సూచన చేసింది. 'తెలంగాణ రక్షణ సమితి' అనేది పాత టీఆర్ఎస్ పార్టీ పేరును పోలి ఒకేలా కనిపిస్తోందని అభిప్రాయపడింది. అలాగే 'తెలంగాణ రక్షణ సేన' అనే పేరు కూడా పాత టీఆర్ఎస్ అర్థం వచ్చేలాగే ఉందని పేర్కొంది. అందువల్ల ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలకు గడువులోగా సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ పేరు కోసం కొన్ని ప్రత్యామ్నాయ పేర్లను ఎన్నికల సంఘానికి సమర్పించాలని కవితకు ఢిల్లీ హైకోర్టు సూచించింది. ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు న్యాయస్థానం సూచించింది.

# ఇండ్ల బిల్లులు మంజూరు చేయాలి: సబ్ కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను క్షమించాలని  కోరుతూ మంగళవారం సబ్ కలెక్టర్ ఉమ హారతికి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట అర్హులైన 43 మంది జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో పలువురు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారని, వెంటనే పూర్తయిన ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. అలాగే కాలనీలో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పించి జర్నలిస్టుల కాలనీని అభివృద్ధి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ ఉమా హారతి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కీసర డి సి రామలింగం ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం





**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్)** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్ నాగర్ లో మంగళవారం జవహర్ నగర్, చంద్రపురి కాలనీ బి ఎల్ ఓ లకు (ఎస్ ఐ ఆర్)ప్రోగ్రాం గురించి  డిప్యూటి కమీషనర్ ఢ జవహర్ నగర్ ఏ ఈ ఆర్ ఓ జి. రామలింగం సమావేశం ఏర్పాటు చేసి బి ఎల్ ఓ లకు ఓటర్ దరఖాస్తు ను ఏ విధంగా పూరించాలి, తర్వాత ఆ దరఖాస్తు ను ఎలా ఆన్లైన్ చేయాలి అని బి ఎల్ ఓ లకు కీసర సర్కిల్ డి సి రామలింగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు

# అంగన్వాడీ టీచర్ల భర్తీ దోపిడీకీ పలుపడ్డ అధికారులు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాలో నోటీపీకేషన్ కు 20 రోజుల ముందే సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవుని పల్లి గ్రమంలో అంగన్వాడీ 1 టీచర్ భర్తీ రాజ కోటాలో దీజ ని నియమించిన అధికారులను వేంటనే భర్తరప్ చేయాలి ఇట్లా దోపిడీ జరిగితే ఆన్లైన్ వెబ్ సైడ్ అప్లికేషన్ ఎందుకు మేడం తక్షణమే కలెక్టర్ గారికి  కీ లెటర్ పంపుతా 17 తారీకు లోపు చెర్యలు తీసుకోని అరులైన రాజ వారికి కేటాయించాలని వింజ్ఞప్తి చేశారు.

# కాప్రా నాయక్ నగర్ బంజారా కాలనీలో స్వయం ఉపాధి శిక్షణ...మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాప్ర మండలం బంజారా నాయక్ నాగర్ లో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లి విఠల్ నాయక్‌లి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ నాయక్ నగర్ బంజారా కాలనీలో మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిభిరంలో శిక్షణ పొందిన మహిళలకు కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ లి స్వర్ణరాజ్ శివమణిలి  కాప్రా డివిజన్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు తన్నీరు శ్రీహరి  ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధి కోర్స్ లలో శిక్షణా పొందినా మహిళలకు సర్టిఫికెట్లను అందించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి పెద్ద పీఠవేస్తుందని, మహిళలు పారిశ్రమిక, స్వయం ఉపాధి రంగాలలో ప్రభుత్వ ప్రోత్సాహంతో రాణించాలని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఈ శిక్షణ శిభిరంలో పొందిన మహిళలకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్  తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి కాప్రా డివిజన్ మజీ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, జిల్లా ఏ ఎం సి మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు,  కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మనోజ్ కుమార్, మానస్, శివ, అభివర్మ మరియు మహిళా నాయకులు సుహిత, పద్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

# 70 లక్షల వ్యయంతో సి సి రోడ్ల పనులను పరిశీలించిన బొంతు శ్రీదేవి యాదవ్

-పలు సమస్యలపై కలెక్టర్ వినతి పత్రం అందించినా బొంతు శ్రీదేవి యాదవ్..



**కాప్ర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం  మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను పరిశీలించారు. కుషాయిగూడ బస్తీలలో మరియు కుషాయిగూడ శిశు మందిర్ స్కూల్ ఆవరణలో 5 గల్లీలో సుమారు రూ. 70 లక్షల వ్యయంతో చేపట్టిన సి సి రోడ్డు పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతపై అధికారులకు దిశానిర్దేశం చేసిన బొంతు శ్రీదేవి యాదవ్ , నిర్దేశిత సమయం లోపు పనులు పూర్తి చేసి స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. మరియు కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్ లోని వివిధ సమస్యల పరిష్కారం కొరకు మేడ్చల్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన



బొంతు శ్రీదేవి యాదవ్

మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేశారు. కుషాయిగూడ మరియు చర్లపల్లి డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

**వినతి చేసిన అంశాలు:**

1. సుబోధయ కాలనీ సోనియా గాంధీ నగర్ కాలనీ లో కొత్త రేషన్ షాప్ మంజూరు చేయాలి
2. గణేష్ నగర్, సుబోదయ, గాంధీ నగర్, న్యూ విరాట్ కాలనీ, జె.కె కాలనీ తదితర కాలనీలలో 58, 59 G.O ల ప్రకారం పెండింగ్ లో ఉన్న ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించాలి
3. బి ఎన్ రెడ్డి కాలనీ, చిన్న చర్లపల్లి కాలనీలలో అంగన్వాడీ సెంటర్ మంజూరు చేయాలి
4. ప్రైమరీ హెల్త్ సెంటర్ కుషాయిగూడ - కొత్త భవనం నిర్మించాలి
5. బి ఎన్ రెడ్డి కాలనీ యు ఎల్ సి సమస్యలను పరిష్కరించి పట్టాలు ఇవ్వాలి

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలని కలెక్టర్ ని బొంతు శ్రీదేవి యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ళ బాల్ రెడ్డి,చర్లపల్లి డివిజన్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్,బత్తుల శ్రీకాంత్ యాదవ్,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గా ముప్పా రామారావు..

## –సీనియర్ నాయకులు, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపినా రామారావు..

**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ కీసర సర్కిల్ మంగళవారం నాడు మెడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నియామక



పత్రాన్ని ముప్ప రామారావు కు అందించి దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితలయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముప్పారామారావు మాట్లాడుతూ.నాపై విశ్వాసం ఉంచి అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ నాయకత్వానికి ముప్పా కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మరియు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.సంస్థను బలోపేతం చేయడం, ప్రజలకు సేవ చేయడం, దమ్మాయిగూడలో మరింత బలమైన కాంగ్రెస్‌ను స్థాపనకు పాటుపడుతానని రామారావు స్పష్టం చేశారు. సీనియర్ నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేయడం ద్వారా దమ్మాయిగూడలో పార్టీ ఉనికిని పటిష్టం చేయడంపై తన ప్రధాన దృష్టి ఉంటుందని ముప్పారామారావు అన్నారు. పార్టీ కార్యకర్తలలో ఐక్యతను పెంపొందించి, డివిజన్ అంతటా పార్టీ పరిధిని విస్తరించడం పార్టీ నీ బలోపేతం చేస్తానని ముప్పా రామారావు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ..కాంగ్రెస్ పార్టీ విధానాలు, కార్యక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తూనే, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాజంలోని ప్రతి వర్గానికి తీసుకువెళ్తానని ముప్పారామారావు అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు చేరాలని, పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజలతో చురుకుగా మమేకమవుతమని ముప్పా రామారావు తెలిపారు. దమ్మాయిగూడలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి మరియు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాజంలోని ప్రతి వర్గానికి చేరవేయడానికి నేను అంకితభావంతో పనిచేస్తాను. ముప్ప రామ రావు దమ్మాయిగూడ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ప్రజా సేవే నా ప్రాధాన్యత ప్రజా సేవయే తన ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుందని పేర్కొంటూ, తాను నివాసితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలతో నిరంతర సంప్రదింపుల ద్వారా స్థానిక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ముప్పారామారావు అన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి అంకితభావంతో, నిబద్ధతతో పనిచేస్తానని ఆయన తెలిపారు.బలమైన కాంగ్రెస్‌పై విశ్వాసం ఈ ప్రాంతంలో పార్టీ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, నిరంతర సంస్థాగత ప్రయత్నాలు, పార్టీ నాయకులు,

కార్యకర్తల మధ్య సన్నిహిత సమన్వయం దమ్మాయిగూడలో కాంగ్రెస్‌ను మరింత బలమైన రాజకీయ శక్తిగా మార్చడంలో సహాయపడతాయని ముప్పారామారావు అన్నారు.

# నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు భూమయ్యా యాదవ్ నియామకం..

## సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపినా భూమయ్య యాదవ్..

## నాయకులతో, కార్యకర్తలతో సమన్వయం తో పార్టీ గెలుపుకు కృషి చేస్తా... భూమయ్యా యాదవ్..



**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ q Ödt** మేడ్చల్ జిల్లా ఘాట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా భూమయ్య యాదవ్ ని నియమించిన సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి లను నాగారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వం నాగారం డివిజన్‌పై ఉంచిన విశ్వాసానికి భూమయ్య యాదవ్ ధన్యవాదాలు తెలియజేస్తూ నాగారం డివిజన్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సమిష్టిగా కృషి చేసి, నాయకులతో,కార్యకర్తలతో సమన్వయం చేసుకుని నాగారం కాంగ్రెస్ పార్టీ గెలుపుకు పాటుపడుతానని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్యా యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో నాగారం ఆల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, జీవన్ రెడ్డి మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల హనుమాన్ నగర్ సదాశివపేట్ లో విద్యార్థులకు నోటుబుక్కు ఎడ్యుకేషన్ కిట్ ల పంపిణీ మండల విద్యాధికారి యన్ శంకర్



**సదాశివపేట వాస్తు తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదాశివపేట మండలంలోని మంగళవారం నాడు ప్రభుత్వ నూతన పాఠశాల హనుమాన్ నగర్ లోని విద్యార్థులకు నోటుబుక్కులను , విద్యా సామాగ్రి కిట్టును సంగారెడ్డి జిల్లా చెందిన హెచ్.డి. ఫ్. సి ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ సేల్స్ మేనేజర్ జి. సంధ్యారాణి విద్యార్థులకు ఉ



చితంగా పంపిణీ చేయడం జరిగింది. పేద విద్యార్థులకు హెచ్. డి. ఫ్. సి నుండి వంపిణీ చేయడం సంతోషకరమని తెలియజేశారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ పేద విద్యార్థులకు కావాల్సిన నోటుబుక్కులను మరియు విద్యా సామాగ్రి కిట్టును పంపిణీ చేయడం సంతోషకరమని ఆ సంస్థ వారికి అభినందించడం జరిగింది. పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీవాసులు నూతనంగా ప్రారంభింపబడిన పాఠశాలలో విద్యార్థులను చేర్పించి పాఠశాలను సద్వినియోగపరుచుకోవాలని విద్యాధికారి తెలియజేశారు.

# అవోపా మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థుల కు ప్రతిభ పురస్కారాలు




**కూకట్ పల్లి జులై 07(వాస్తవ తెలంగాణ )** పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 200 మంది విద్యార్థులకు ఆర్యవైశ్య ఆఫీషియల్స్ ఢ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మేడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి సతీష్ ల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించిరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా , కోలేటి దామోదర్ , గండే సుధాకర్, కల్వ సుజాత , ఉప్పల వెంకటేష్, ఉప్పల శ్రీనివాస్, ఉప్పల శారద , నిలోఫర్ బాబూరావు , విశిత జ్యువెలర్స్ ఆనంద్ , మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, పవన్ గుప్తా పాల్గొని విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కృషి చేయాలని, విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా అవోపా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల నాగరాజు మాట్లాడుతూ, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అవోపా యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత పది రోజులుగా రాత్రింబవళ్లు శ్రమించి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మేడ్చల్ జిల్లా కోర్ టీమ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. .ఈ కార్యక్రమంలో అవోపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ , ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్ , ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్టా రవికుమార్ , మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వందనపు శిల్ప , హైదరాబాద్ జోన్ నాయకులు, వివిధ జిల్లాల నాయకులు, ప్రముఖులు, దాతలు, సభ్యులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**నారాయణ్ ఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్..** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆర్థికంగా స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంగారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పట్టణంలోని బాల సదనం కేంద్రంలో జిల్లా మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 'మిషన్ శక్తి – బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ..సమాజంలో మహిళల రక్షణ, విద్య, మరియు వారి సాధికారత కోసం 'బేటీ బచావో బేటీ పడావో' మరియు 'మిషన్ శక్తి' పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, తమ చేతి వృత్తుల ద్వారా స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలవాలన్నారు.కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత అధికారులు రాజు, మహేష్ చౌహన్, మున్సిపల్ కౌన్సిలర్, రమేష్ చౌహన్,మాజీ ఎంపీటీసీ, పండరి రెడ్డి స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు,నాయకులు,మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు



**నర్సాపూర్,వాస్తవ తెలంగాణ//**మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలనీ మంగళవారం మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్ కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని రెండో పిఆర్సి అమలు చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 26 వేల వేతనం ఇవ్వాలని కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని మున్సిపల్ పరిధిలో పనిచేసే కార్మికులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము మున్సిపల్ కార్మికుల యొక్క సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని లేని ఎడలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. వర్షాకాల సమయంలో కార్మికులకు కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్( సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు పుష్ప ,యూనియన్ అధ్యక్షులు రాములు నాయకులు శంకర్, అశోక్, అనిత, జ్యోతి, సంగీత, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమ వారిధి జగ్గారెడ్డి చిన్నారుల మధ్య ఘనంగా జగ్గన్న జన్మదిన వేడుకలు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంవెంకటాపూర్ ప్రభుత్వం పాఠశాలలో బడి పిల్లలకు నోట్స్ బుక్స్ పెన్స్ పంపిణి జన హృదయ నేత కోసం మరిన్ని సామాజిక సేవ కార్యక్రమలు చేపడుతాం కాంగ్రెస్ నాయకుడు గోల్డ్ మెన్ మామిడి రాజు నిత్యం ప్రజల సంక్షేమ కోసం పని చేసి మహా నాయకుడు జన. హృదయ నేత జగ్గారెడ్డి. జగ్గన్న జన్మదినం సందర్భంగా సదాశివ పేట కాంగ్రెస్ నాయకుడు గోల్డ్ మెన్ మామిడి రాజు ఆధ్వర్యంలో వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేసి బడి పిల్లలకు నోట్ బుక్స్ పెన్స్ పంపిణి చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ నిత్యం నీరుపెద అండగా నిలుస్తు వారి సంక్షేమే తన అభిమాతంగా మలుచుకున్నారని, అధికారం ఉన్నా లేకున్నా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని తేలిపారు. గొప్ప మానవతా వాది జన్మదిన వేడుకలు బడి పిల్లలు ప్రజల మధ్య నిర్వహించటం అభినందనియమని తేలిపారు. ఈ కార్యక్రమం కేవలం శుభాకాంక్షలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా సాగిందని చెప్పు కోచ్చారు. ప్రజాప్రతినిధుల పుట్టినరోజులను సేవా కార్యక్రమాలకు వేదికగా మార్చడం సమాజానికి సానుకూల సందేశాన్ని అందిస్తుందన్నారు..వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేయడం ద్వారా విద్యకు ప్రోత్సాహం లభించిందిని పేర్కొన్నారు.ఇటువంటి కార్యక్రమాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు కొంత మేర ఉపశమనం కలిగించడమే కాకుండా, చదువుపై మరింత ఆసక్తిని పెంపొందిస్తాయన్నారు. జగ్గన్న ఆశయాల కోసశీ నిరంతం పాటు పడుతనని తేలిపారు.సామాజిక సేవకు మామిడి రాజు సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిస్తుంది.జగ్గారెడ్డి రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజల మధ్య ఉండే నాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన అనుచరునిగా నేను ఉండటం ఎంతో సంతోషన్నిస్తుదన్నారు. అందుకే ఆయనను "జనహృదయ నేత"గా అభివర్ణిస్తూ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం విశేషం. ఇలాంటి కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా, ఏడాది పొడవునా విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో సేవలు నిర్వహించడం జరుగుతుందని తేలిపారు. ఈ సేవలు నిరంతరంగా కొనసాగితే సమాజంపై మరింత ప్రభావం చూపతయాని తెలిపారు.. ప్రజాప్రతినిధుల పుట్టినరోజులు ప్రచార కార్యక్రమాలుగా కాకుండా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే సేవా దినోత్సవాలుగా మారితే వాటి విలువ మరింత పెరుగుతుందనే అభిప్రయం వ్యక్తం చేశారు. జగ్గారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం సామాజిక స్పృహను ప్రతిబింబించిన కార్యక్రమం చూడాలన్నారు.ప్రజాసేవే లక్ష్యంగా ఉండాలనే సందేశాన్ని ఇలాంటి కార్యక్రమాలు బలంగా చాటుతున్నాయి.సామాజిక సేవకార్యక్రమాలు మారిశీత విస్తరిస్తమని తెలిపారు.ఈ కార్యక్రమం లోమాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి వవిశ్వనాథం మామిడి రాజు సంగమేశ్వర్ రమేష్ సిద్దు భానుతేజ ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించిన కాంగ్రెస్ నాయకులు



**కూకట్ పల్లి జూలై 7 (వాస్తవ తెలంగాణ)** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమం లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్ పరిధిలోని గోపాలనగర్, విశ్వాంబరి, శ్రీలా, శిల్పా ఎవెన్యూ, ఎస్‌ఎంఆర్ సిటీ కాలనీల్లో సోమవారం ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులను నిర్దేశిత దరఖాస్తుల ద్వారా వెంటనే పూర్తి చేయాలని సూచించారు.ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని ఫారాలను త్వరితగతిన సమర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జునకు శుభాకాంక్షలు వెలువ



**కూకట్ పల్లి జూలై 8 (వాస్తవ తెలంగాణ )** కూకట్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించినటువంటి కావేటి నాగార్జున తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణను భాగ్యనగర్ కాలనీ లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు , ఈ సందర్భంగా కావేటి నాగార్జుననీ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు, తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ డివిజన్ సీనియర్ నాయకులు యం వెంకటరమణ, రాకేష్, భాను, అవినాష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# నూతన పైప్‌లైను పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్ పల్లి జులై 07 (వాస్తవ తెలంగాణ )** కూకట్అ పల్లి అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్ లో మంగళవారం నూతన వాటర్ పైప్లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ పరిపాలనలో మంచినీటికీ ఎటువంటి కొరత లేకుండా చూసాం అని 20వేల లీటర్ల వరకు ఉచితంగా మంచినీరు అందించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం మౌలిక సదుపాయాలు ప్రజలకు అందించడంలో విఫలమయ్యారని.. అబద్దపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆనాడు కెసిఆర్ ప్రారంభించిన ఎన్నో మంచి పథకాలకు స్వస్తి చెప్పారని మహిళలకు 2500 ,తులం బంగారం ,ఇమాములకు బ్రాహ్మణులకు కనీసం ప్రోత్సాహకాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.. ఇప్పటికైనా కళ్ళు తెరుచుకుని నిరుపేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు ,కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సభియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి జులై 07(వాస్తవ తెలంగాణ )** అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, దత్తాత్రేయ కాలనీలలో చేపడుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు, బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా

ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని, నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశెట్టిగౌడ్, జగదీష్, సత్యనారాయణ, అశోక్, రామకృష్ణ, మోసిన్, రవీందర్, బి.ఎల్.ఓ లు అరుణ కుమారి, శైలజ, వరలక్ష్మి, పద్మ, రుద్రాణి, వాణి, రజిత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలి శంకర్ పల్లి తహసిల్దార్ సురేందర్..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులు, బి ఎల్ ఓ సూపర్వైజర్లతో మంగళవారం శంకర్ పల్లి తహసిల్దార్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఈ ఆర్ ఓ, శంకర్ పల్లి తాసిల్దార్ సురేందర్ క్రింది సూచనలు జారీ చేశారు. ఓటర్ల గరిష్ట భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు గ్రామస్థాయిలో ప్రతిరోజు మేళలు నిర్వహించాలని తెలిపారు. గ్రామస్థాయిలో అందుబాటులో ఉన్న అన్ని శాఖలకు చెందిన అవసరమైన క్షేత్రస్థాయి సిబ్బంది ఈ ఈ కార్యక్రమాలలో పాల్గొని, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సర్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన సహకారాన్ని అందించాలన్నారు. పై సూచనలను సంబంధిత వారందరూ ఖచ్చితంగా పాటించాలని తహసిల్దార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ గిరిరాజు, ఏపీవో నాగభూషణం తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్గీయ గండిచర్ల ఎల్లారెడ్డి 10 వ వర్ధంతి సందర్భంగా నీమ్స్ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం..పాల్గొన్న తనయులు జనార్ధన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన స్వర్గీయ ఎల్లారెడ్డి 10 వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు లైన్స్ క్లబ్ కోశాధికారి గండిచేర్ల జనార్దన్ రెడ్డి, శంకర్ పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి లు మంగళవారం హైదరాబాదు నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్ శేరిలింగంపల్లి లయన్ క్లబ్ అధ్యక్షులు జి. నరసింహులు గౌడ్, లయన్ డి. లక్ష్మీనారాయణ గౌడ్ (జిల్లా సంయుక్త కోశాధికారి లైన్స్ క్లబ్), లయన్ సుధీర్( మణికొండ జోన్ చైర్మన్) తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జనసేన కార్యకర్తను ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



**కూకట్ పల్లి జులై 07 (వాస్తవ తెలంగాణ ) కూకట్ పల్లి** మోతీనగర్ లీలా హాస్పిటల్ లో న్యూరో సమస్య తో గత రెండు రోజులుగా చికిత్స పొందుతున్న అల్లాపూర్ కు చెందిన జనసేన కార్యకర్త ప్రసాద్ ని మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్ట్ ఎం ఎల్ ఏ అభ్యర్ధి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పరమశించారు ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి, ప్రస్తుతం జరుగుతున్న చికిత్స వివరాలు, అవసరమైన మెడికల్ టెస్ట్‌లు, మందులు, మరియు రికవరీ ప్రాసెస్ గురించి తెలుసుకున్నారు. ఆయనకు కావాల్సిన వైద్య సాయం త్వరితగతిన అందేలా ఆసుపత్రి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే కార్యకర్త కుటుంబ సభ్యులను ధైర్యపరుస్తూ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ వారి పక్కనే ఉంటామని, అవసరమైన సహాయాన్ని అందించేందుకు ముందుంటామని హామీ ఇచ్చారు.కొల్లా శంకర్, వేముల మహేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ్ ఖేడ్ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్న మంత్రులు... ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** రూ.52.9 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఈనెల 9న రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం క్యాంప్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద రూ.3.90 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన అర్బన్ పార్కును మంత్రులు ప్రారంభించనున్నారని చెప్పారు. జూకల్ శివారులో రూ.47 కోట్లతో నిర్మించనున్న



ఏటీసీ భవనానికి, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా రూ.2 కోట్లతో చేపట్టనున్న ఎకో టూరిజం ప్రాజెక్ట పనులకు వారు శంకు స్థాపనలు చేయనున్నట్లు వివరించారు. పై కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఇట్టి కార్యక్రమాలలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.




# మూత బడులు

ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో చాలా పాఠశాలలు మూతబడుతున్నాయి.సర్కార్ బడుల్లో పిల్లలను చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం చేపట్టిన కూడా ఉపయోగం లేకుండా పోతుంది. గత జూన్‌లో ఈ కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వ పాఠశాలల్లో అరకొరగానే విద్యార్థులు చేరారు.అయినా ఉపాధ్యాయులు ఏం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో సర్కార్ స్కూల్స్ మూత"బడే"పరిస్థితి నెలకొంది. పట్టుమని పదిమంది విద్యార్థులు లేని బడుల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఈ విధంగా విద్యా వ్యవస్థ కొనసాగితే ప్రభుత్వ బడులను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలు విద్యార్థి, పలు ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో విద్యార్థులు లేక 9 స్కూల్స్ మూతపడ్డాయి.

(వాస్తవ తెలంగాణ )

## ఉపాధ్యాయులు ఫుల్.. విద్యార్థులు నిల్

- నలుగురు విద్యార్థులకు ఇద్దరు చొప్పున టీచర్లు
- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రుల అనాసక్తి
- నర్సింహులపేట మండలంలో తొమ్మిది స్కూళ్లు మూత
- ప్రభుత్వ పాఠశాలలపై కొరవడుతున్న పర్యవేక్షణ
- రాబోయే రోజుల్లో నిరుద్యోగులకు సర్కారు కొలువు ప్రశ్నార్థకమే

### ప్రభుత్వం సౌకర్యాలు అందిస్తున్నా..

ప్రభుత్వం అందించే ఉచిత దుస్తులు..మధ్యాహ్న భోజనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినా విద్యార్థుల శాతం పెంచకపోవడంతో రాబోయే రోజుల్లో సర్కార్ కొలువు కోసం ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకే అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నర్సింహులపేట మండలంలోని పాఠశాలలు

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో 36 ప్రాథమిక పాఠశాలలు,10 ప్రాథమికోన్నత పాఠశాలలు,02 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది 2,010 మంది విద్యార్థులు ఉంటే ఈ ఏడాది ప్రస్తుతం 1800 మంది ఉన్నారు.వీటిలో ఆంధ్రప్రభ పరిశీలన చేయగా.. 9 ప్రాథమిక పాఠశాలలు మూత బడ్డాయి.

### కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

గోపాతండ గ్రామ పంచాయతీ పరిధి అమీర్యతండాలో ఉండే పాఠశాల విద్యార్థులు లేక మూతపడగా బడిబాటలో భాగంగా పాఠశాల తెరిచారు. కానీ మూడు రోజులకే విద్యార్థులు లేక మూతపడింది. వస్త్రం తండాలో కూడా ఇదే పరిస్థితి.ఇలా మండలంలో తొమ్మిది స్కూళ్లు మూతపడ్డాయి.ఇలా సగం పాఠశాలల్లో నలుగురు ముగ్గురు ఉపాధ్యాయులు.. నలుగురు, ముగ్గురు విద్యార్థులతో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.విద్యార్థుల హాజరు శాతం లేకపోవడంతో బడులు మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది.

### తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా నర్సింహులపేట మండలం ఎంపిక

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో ఉన్న పీఎం శ్రీ పాఠశాల తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా ఎంపిక అయింది.దీంతో మండల ప్రజలు హర్ష వ్యక్తం చేస్తున్నారు.కానీ గ్రామాల నుంచి బస్సుల ద్వారా పిల్లలను తీసుకురావాలని తండాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్లో పనిచేసే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.




# నిబంధనలకు.. తిలోదకాలు

## అరకొర శిక్షణతో పిల్లల డ్రైవింగ్ క్లాస్

డ్రైవింగ్ నేర్చుకుందామని వెళ్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతోంది. హైదరాబాద్‌లోని పలు డ్రైవింగ్ స్కూళ్లు అరకొర శిక్షణ పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. అనుభవం లేని డ్రైవర్లతో క్లాసులు చెప్పిస్తూ, ఆర్‌టీఏ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. విషయం తెలుసుకుని ప్రశ్నిస్తే యాజమాన్యం బూతుల దండకం అందుకుంటోంది. రవాణా శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది.

- నిలువు దోపిడీ చేస్తున్న డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యం
- నిమ్మకు నీరెత్తినట్టు రవాణా శాఖ
- ప్రశ్నిస్తే యాజమాన్యం బూతుల దండకం



### కేస్ స్టడీ-1
#### బాధితుడి ఆవేదన

మాదాపూర్‌కు చెందిన రమేష్ తన 17 ఏళ్ల కొడుకును కూకట్‌పల్లిలోని 'సేఫ్ డ్రైవ్' డ్రైవింగ్ స్కూల్‌లో చేర్పించాడు. ₹18,000 ఫీజు కట్టాడు. "21 రోజులు ట్రైనింగ్, లైసెన్స్ గ్యారంటీ" అని చెప్పారు. కానీ జరిగింది వేరు. "మొదటి 2 రోజులు క్లాస్ రూమ్‌లో థియరీ. 3వ రోజు మా అబ్బాయిని కారు ఎక్కించి, ఒక క్లీనర్‌కు అప్పగించారు. వాడికి సరిగ్గా గేర్లు కూడా వేయడం రాదు. 5వ రోజు 'ట్రైనింగ్ అయిపోయింది, రేపు టెస్ట్' అన్నారు. నేను అడిగితే 'మీ అబ్బాయికే తెలివి తక్కువ, అందుకే నేర్చుకోలేదు' అని బూతులు తిట్టారు" అని రమేష్ వాపోయాడు. ఆ తర్వాత రమేష్ కొడుకు స్నేహితుడి బైక్ తీసుకుని రోడ్డెక్కాడు. ఎల్బీ నగర్‌లో యాక్సిడెంట్ అయి కాలు విరిగింది. "డబ్బులు తీసుకుని నా కొడుకు జీవితంతో ఆడుకున్నారు" అని రమేష్ కన్నీటిపర్యంతమయ్యాడు.

### కేస్ స్టడీ-2
#### విలేకరికి చేదు అనుభవం

ఓ విలేకరి ఇటీవల 'న్యూ వే డ్రైవింగ్ స్కూల్స్ ఎల్‌బీ నగర్ యజమాని సురేష్‌ను సంప్రదించాడు. "మీ దగ్గర ఆర్‌టీఏ లైసెన్స్ ఉందా? ట్రైనర్ల అర్హత ఏమిటి?" అని అడగ్గానే ఆయన రెచ్చిపోయాడు. "ఏం పీకుతారు? మా తాతల కాలం నుంచి ఈ దందా చేస్తున్నాం. ఆర్‌టీఏ ఆఫీసర్లే మా ఫ్రెండ్స్. నీలాంటి వాళ్లు ఎంత మంది వచ్చారు. వెళ్లి నీ పని నువ్వు చూస్కో. మళ్లీ కనిపిస్తే తంతా" అని బెదిరించాడు. అంతేకాదు అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ అక్రమాలపై ఆర్‌టీఏ జాయింట్ కమిషనర్‌ను సదరు విలేకరి కలిస్తే ఆయన చెప్పిన మాటలు దిమ్మతిరిగేలా ఉన్నాయి. "మాకు కంప్లైంట్ రాలేదు. వస్తే చర్యలు తీసుకుంటాం. మేమే వెళ్లి ప్రతి స్కూల్ చెక్ చేయలేం కదా" అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

### లెక్కలేని అక్రమ స్కూళ్లు

గ్రేటర్ హైదరాబాద్‌లో 700కు పైగా స్కూళ్లు లైసెన్స్ లేకుండా నడుస్తున్నాయి. డిపార్ట్‌మెంట్ దగ్గర లిస్ట్ కూడా లేదు. కేంద్ర మోటారు వాహన నిబంధన 1989 ప్రకారం డ్యూయల్ కంట్రోల్ కారు, అర్హత ఉన్న ట్రైనర్, లెక్చర్ హాల్ తప్పనిసరి. కానీ 80% స్కూళ్లలో ఇవి లేవు. అన్ని స్కూళ్లను సారథి పోర్టల్‌తో లింక్ చేయాలని రూల్ ఉన్నా, అక్రమ స్కూళ్లను పట్టించుకునే నాథుడే లేదు. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన కొందరు ఎంవీఐలు, ఏఎంవీఐలు అక్రమ స్కూళ్లకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### పిల్లల ప్రాణాలు గాలిలో దీపం

సరైన శిక్షణ లేకుండా లైసెన్స్ పొందిన యువత రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల లెక్కల ప్రకారం గత 6 నెలల్లో 1822 ఏళ్ల వయసు వారి వల్ల జరిగిన ప్రమాదాలు 42% పెరిగాయి. ఇక స్కూల్ బస్ డ్రైవర్ల పరిస్థితి మరీ దారుణం. 2 వారాల్లో 35 మంది డ్రంక్ డ్రైవర్లు పట్టుబడ్డారు. వీళ్లందరికీ శిక్షణ ఇచ్చింది ఇలాంటి అక్రమ స్కూళ్లే.

### రవాణా శాఖ చెప్పేది ఏమిటంటే..

కమిషనర్ ఇలంబరితి మాత్రం "2026 ఏప్రిల్ 1 నుంచి ఎల్ఎల్ఆర్ ముందు 6 మాడ్యూల్స్ ఆన్‌లైన్ టెస్ట్ తప్పనిసరి చేశాం. ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్ చేస్తాం. విద్యార్థుల భద్రతకు స్కూల్ యాజమాన్యాలదే బాధ్యత" అని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అమలు శూన్యం.

### సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని,,

అక్రమ డ్రైవింగ్ స్కూళ్లు, అవినీతి అధికారులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధితుల ఫిర్యాదుతో యాజమాన్యంపై 304A ఐపీసీ కింద కేసు పెట్టాలని, అక్రమ స్కూళ్ల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలంటున్నాయి. యాక్సిడెంట్‌లో గాయపడ్డ వారికి ఆ స్కూల్ యాజమాన్యం నుండే పరిహారం ఇప్పించాలి. "డబ్బులు దోచుకోవడమే కాదు, ప్రశ్నిస్తే బూతులు తిడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే మేమే రోడ్డెక్కి ఆందోళన చేస్తాం" అని డ్రైవింగ్ స్కూల్ బాధితుల సంఘం అధ్యక్షుడు నర్సింహ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఈ 'నిలువు దోపిడీ' దందాకు అడ్డుకట్ట వేయకపోతే, రోడ్లన్నీ రక్తమోడతాయని హెచ్చరిస్తున్నారు.



# గురుకులంలో ర్యాగింగ్

- కళ్లకు గంతలు కట్టి పెన్ను క్యాప్ మింగించారు
- మహాత్మ జ్యోతిబాపూలేలో ర్యాగింగ్ దాష్టీకం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలి తల్లిదండ్రులు



(వాస్తవ తెలంగాణ ) ఉమ్మడి ఆదిలాబాద్: విద్యా వినయం... క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన గురుకులాల్లో సభ్య సమాజం తలదించుకునే రీతిలో అమానుష ఘటనలు ఒక్కోటి వెలుగు చూస్తునే ఉన్నాయి. హై స్కూల్ స్థాయి బాలికల్లోను ర్యాగింగ్ భూతం జడలు విప్పుతూ అమాయక విద్యార్థుల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. సహచర విద్యార్థిని అని కూడా చూడకుండా, కళ్లకు గంతలు కట్టి.. బలవంతంగా పెన్ను క్యాప్ మింగించిన అమానుష ఘటన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అలజడి రేపుతోంది.

## ర్యాగింగ్ తో వేధించి..

కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం దహేగాం రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఉషాన్ శృతి అనే విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. కాగా, అదే పాఠశాలకు చెందిన నలుగురు సహచర విద్యార్థినులు శృతిపై ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా కిరాతకంగా ప్రవర్తించి ఆ బాలికను వేధించారు. బాధిత విద్యార్థిని శృతి కళ్లకు గంతలు కట్టి, కాళ్లు చేతులు కదలకుండా గట్టిగా బిగించి పట్టుకున్నారు. అనంతరం నోట్లో పెన్ క్యాప్ వేసి, అది లోపలికి వెళ్లేలా బలవంతంగా నీళ్లు పోసి మింగించారు. వెంటనే బాలిక గొంతులో గుక్క తిప్పుకుండా నా నా యాతన పడాల్సి వచ్చింది. ఈ విషయం బయటకి పొక్కడంతో పాఠశాలలో చదివే విద్యార్థులంతా ఉలిక్కిపడ్డారు. ఆందోళన చెంది తమ తల్లి దండ్రులకు సమాచారం కూడా అందించారు.

## ఎండోస్కోపిక్ స్కానింగ్ లో..

వేధింపులతో పదో తరగతి చదివే విద్యార్థిని శృతి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే స్పందించిన యాజమాన్యం ఆమెను ప్రాథమిక చికిత్స అనంతరం మంచిర్యాల ఆసుపత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు స్కానింగ్ చేయగా, బాలిక కడుపులో పెన్ క్యాప్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అత్యవసరంగా చికిత్స అందించిన వైద్యులు.. శృతి కడుపులో ఉన్న పెన్ క్యాప్‌ను బయటకు తీశారు. ప్రస్తుతం బాలిక ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.



## ర్యాగింగ్ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు

మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో జరిగిన ఈ ర్యాగింగ్ ఉదంతంపై బాధిత విద్యార్థిని తండ్రి ఉషాన్ రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన రమేష్ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యాన్ని తప్పుపట్టారు. అక్కడ పర్యవేక్షణ లోపం కారణంగానే తన కూతురిపై హై స్కూల్ బాలికలు వేధింపులకు గురిచేసారని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ అమానుష వేధింపుల ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

# శాసనసభ, మండలి కమిటీల.. చైర్మన్ల నియామకం

తెలంగాణ శాసనసభ, శాసనమండలి 2026–27 సంవత్సరానికి ఉమ్మడి కమిటీలు, సంక్షేమ కమిటీలు, శాసనసభ కమిటీలు, శాసనమండలి కమిటీలకు చైర్మన్లు, సభ్యులను నామినేట్ చేస్తూ తెలంగాణ లెజిస్లేచర్ బులెటిన్ విడుదల చేసింది. వివిధ కమిటీలకు చైర్మన్ల నియామకంతో పాటు సభ్యుల జాబితాను అధికారికంగా ప్రకటించిం



## ఉమ్మడి కమిటీలు

- సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ – కడియం శ్రీహరి
- అమెనిటీస్ కమిటీ – గౌరవ సభాపతి,
- తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ – మేడిపల్లి సత్యం
- షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ గా పాయం వెంకటేశ్వర్లు
- వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ – మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్
- గ్రంథాలయ కమిటీ – డా. మట్టా రాగమయి
- మహిళలు, పిల్లలు, దివ్యాంగులు , వృద్ధుల సంక్షేమ కమిటీ – శ్రీమతి చిట్టెం పర్ణికా రెడ్డి
- మైనారిటీల సంక్షేమ కమిటీ – లక్ష్మీకాంతరావు తోట
- వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ – గౌరవ సభాపతి, తెలంగాణ శాసనసభ

## శాసనసభ కమిటీలు

- పిటిషన్స్ కమిటీ – గౌరవ ఉప సభాపతి, తెలంగాణ శాసనసభ
- ప్రివిలేజెస్ కమిటీ – గౌరవ ఉప సభాపతి,
- తెలంగాణ శాసనసభ ప్రభుత్వ హామీల కమిటీ – పట్లోళ్ల సంజీవ రెడ్డి
- రూల్స్ కమిటీ – గౌరవ సభాపతి,
- తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ – రేవూరి ప్రకాశ్ రెడ్డి

## శాసనమండలి కమిటీలు

- పిటిషన్స్ కమిటీ – గౌరవ ఉప చైర్మన్, తెలంగాణ శాసన మండలి
- ప్రివిలేజెస్ కమిటీ – గౌరవ ఉప చైర్మన్, తెలంగాణ శాసనమండలి
- ప్రభుత్వ హామీల కమిటీ – కేతావత్ శంకర్ రూల్స్ కమిటీ – గౌరవ చైర్మన్, తెలంగాణ శాసనమండలి సభ
- ముందుంచిన పత్రాల కమిటీ – చల్లా వెంకట్రాం రెడ్డి
- ఎథిక్స్ కమిటీ – మహేష్ కుమార్ గౌడ్ బొమ్మ

# కొండా వర్సెస్ కడియం

- మంత్రి , ఎమ్మెల్యే మధ్య లడాయి
- వరంగల్ అభివృద్ధిపై కడియం సమీక్షపై మంత్రి అసహనం
- జిల్లా వ్యవహారాల్లో ఎమ్మెల్యే జోక్యంపై ఫైర్
- నేరుగా కాంగ్రెస్ అధిష్ఠానానికి కొండా సురేఖ ఫిర్యాదు



(వాస్తవ తెలంగాణ ) మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. జిల్లా వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకుంటున్నారంటూ మంత్రి సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. నిన్న (సోమవారం) వరంగల్ నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి వరంగల్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను కోరినట్లు తెలిసింది. వరంగల్ జిల్లా వ్యవహారాల్లో కడియం జోక్యం చేసుకోవడంపై కొండా సురేఖ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచా రం. ఈ వ్యవహారంపై ఏఐసీసీ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ లేఖ రాయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఈ పరిణామంతో కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాలు మరోసారి బయటపడ్డాయి.

# పచ్చదనంతో..పర్యావరణ సమతుల్యత

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ చల్లిన విద్యార్థులు



(వాస్తవ తెలంగాణ ) పచ్చదనం పెరగడం ద్వారా పర్యావరణ సమతుల్యత నెలకొంటుందని జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ అన్నారు. మంగళవారం ఎన్‌సీసీ కార్యక్రమాల భాగంగా విద్యార్థులతో సీడ్ బాల్స్ చల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణతో పాటు రహదారికి ఇరువైపులా విద్యార్థులు సీడ్ బాల్స్ చల్లి పచ్చదనం పెంపునకు తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ మాట్లాడుతూ, వర్షాకాలంలో సీడ్ బాల్స్ చల్లడం వల్ల మొక్కలు సులభంగా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సురేందర్, కళ్యాణి, అనిల్ కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, పద్మలలిత, విజయభాస్కర్, రాజయ్య, మజహర్‌తో పాటు సీఆర్పీలు పాల్గొన్నారు.

